క్లుప్తంగా

ఐఐటీలో 44వ ర్యాంకు



శ్రీజని

నల్లగొండ: నల్లగొండలోని రాక్‌హిల్స్ కాలనీకి చెందిన కోరెపాక శ్రీజని ఇటీవల వెలువడిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 44వ ర్యాంకు సాధించింది. తమ కూతురు జాతీయ స్థాయిలో 44వ ర్యాంకు సాధించడం తమకు ఎంతో ఆనందంగా ఉందని తండ్రి ఆంజనేయులు, తల్లి చైతన్య హర్షం వ్యక్తం చేశారు.

రైతాంగ సాయుధ పోరాట యోధురాలికి నివాళి



నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

కట్టంగూర్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు గోదల రాధమ్మ 12వ వర్ధంతిని బుధవారం మండలంలోని పందెనపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. రాధమ్మ చిత్రపటానికి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోదల కృష్ణారెడ్డి, కుంభం తారకమ్మ, బండారు వెంకట్‌రెడ్డి, గోదల యాదవరెడ్డి, గద్దపాటి యాదయ్య, కొండి సోమిరెడ్డి, బండ అచ్చమ్మ, వసంత, భిక్షంరెడ్డి, నర్సమ్మ, ఊర్మిళ, జ్యోతి, రాములమ్మ పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న డీఈఈ సుధాకర్‌రెడ్డి

శాలిగౌరారం: శాలిగౌరారం బస్టాప్ నుంచి రామగిరి శివారు వరకు రూ.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 2.1 కిలోమీటర్ల డబుల్ రోడ్డు పనులను బుధవారం ఆర్‌అండ్‌బీ డీఈఈ సుధాకర్‌రెడ్డి పరిశీలించారు. శాలిగౌరారం బస్టాప్ సమీపంలో నిర్మిస్తున్న బాక్స్ బ్రిడ్జి పనులు, మట్టి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాలిగౌరారం–గురుజాల ప్రధాన ఎండీఆర్(మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్డు) ఆర్‌అండ్‌బీ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపడుతున్నట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించేందుకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. ఆయనవెంట ఏఈ సంతోష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మర్రిగూడ : మండలంలోని శివన్నగూడ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్నందున సబ్‌స్టేషన్ పరిధిలోని ఏడు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేష్ తెలిపారు. కుదాబాక్షపల్లి, శివన్నగూడ, సరంపేట, మేటిచందాపురం, కొట్టాల, దామెరబీమనపల్లి, రాంరెడ్డిపల్లి గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రైతులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు.

ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

చిట్యాల: వెలిమినేడు గ్రామ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘానికి ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని ఆ గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్రూరి శ్రీశైలం కోరారు. వెలిమినేడు గ్రామంలో బుధవారం జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకు ఓటర్ లిస్టును ప్రకటించకుండా, ఎన్నికల నోటిఫికేషన్ వేయకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో పాల ఉత్పత్తిదారుల సంఘం మాజీ చైర్మన్ గడ్డం సూర్యప్రకాష్‌రెడ్డి, నాయకులు దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాతి శ్రీనివాస్, చిర్రబోయిన రవి, పైళ్ల రఘుమారెడ్డి, దేవిరెడ్డి సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల నిరసన

మునుగోడు: నారాయణపురం మండల కేంద్రానికి చెందిన ఫొటోగ్రాఫర్ లింగస్వామిపై దాడి చేసిన నిందితులను శిక్షించాలని కోరుతూ మునుగోడు మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు మాదగోని సైదులు, ప్రధాన కార్యదర్శి కాటం వెంకన్న, గౌరవ అధ్యక్షులు పొట్లపల్లి యాదయ్య, జాజుల లింగస్వామి, ఉపాధ్యక్షుడు నిమ్మల నాగార్జున, కోశాధికారి నూకల లింగస్వామి, రావిరాల కుమారస్వామి, కోణం మురళి, విజయ్, శ్రీశైలం, రావుల శ్రీను, వసంత్, మల్లికార్జున్, రమేష్ నరేష్ స్వామి, వినయ్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఫొటోగ్రాఫర్లు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- వేసవి సెలవుల అనంతరం బడులు పునః ప్రారంభం
- విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేసిన నకిరేకల్, తుంగతుర్తి ఎమ్మెల్యేలు వీరేశం, సామేల్



నకిరేకల్ : పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



శాలిగౌరారం : పెర్కకొండారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

నకిరేకల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని జెడ్పీ హైస్కూల్, కేంద్ర ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఆయన ప్రొఫెసర్ జయ శంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విద్యా విధానలను సమూలంగా మార్పులు చేయనున్నారని అన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి పాటుపడతానని హామీ ఇచ్చారు. త్వరలో తాను స్థాపించిన ఉద్దీపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రైమరీ నుంచి ఐదో వతరగతి వరకు ఒక స్కూల్‌ను ప్రారంభించబోతున్నాని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు, మున్సిపల్ కమిషనర్ బాలయ్య, ఎంఈఓ మేకల నాగయ్య, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం రాములు, మున్సిపల్ కౌన్సిలర్లు గాజుల సుకన్యశ్రీనివాస్, యాసారం లక్ష్మీ వెంకన్న, గడ్డం స్వామి , ఉపాధ్యాయులు పోతుల గోపాల్, యాట మధుసూదన్‌రెడ్డి, రామూర్తి, నాగేంద్రప్రసాద్, సౌజాత తదితరులు ఉన్నారు.

కేతేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, భోజనం అందజేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, ఇనుపాముల ఎంపీటీసీ బొజ్జ సుందర్, తహసీల్దారు మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఎంఈఓ నాగయ్య, హెచ్‌ఎం నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

శాలిగౌరారం: ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమై పూర్వ వైభవం రావాలంటే ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పనిచేయాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా మండలంలోని పెర్కకొండారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఆయన పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్, స్కూల్ యూనిఫాం పంపిణీ చేశారు. మొదటగా జ్యోతి ప్రజ్వలన చేసి తెలంగాణతల్లి, ఆచార్య జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. తదుపరి ఎస్సెస్సీలో 10 జీపీఏ సాధించిన పాఠశాలకు చెందిన సాయిగణేశ్, ప్రవళికను మెమొంటోలు, శాలువాలతో సత్కరించి నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సైదులు అధ్యక్షతన జరిగిన ఆ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎర్ర రణీల, ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంఈఓ నాగయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు నూక సత్తయ్య, పాదూరి శంకర్‌రెడ్డి, షేక్ ఇంతియాజ్, లోకసాని రంగారెడ్డి, బండారు మల్లయ్య, తీర్పారి మల్లయ్య, నూక కిశోర్, పల్స సైదులు, రాపర్తి వెంకటేష్, జానిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, అల్లి సైదులు, దేవరకొండ శంకర్, శ్రవణ్, యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.



చిట్యాల: యూనిఫాం అందజేస్తున్న ఎంపీటీసీ వడ్డెపల్లి లక్ష్మయ్య

చిట్యాలలో..

చిట్యాల: ప్రభుత్వం అందించే వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని తాళ్ళవెల్లెంల ఎంపీటీసీ సభ్యుడు వడ్డెపల్లి లక్ష్మయ్య అన్నారు. తాళ్ళవెల్లెంల గ్రామంలోని యూపీఎస్‌లో విద్యార్థులకు బుధవారం ఆయన దుస్తులు, పుస్తకాలు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సైదులు, కిరణ్‌కుమార్, ఆంజనేయులు, కాటమయ్య, లింగారెడ్డి, నాయకులు బుచ్చిరాములు, దశరథ, అశోక్ పాల్గొన్నారు.



కనగల్ : విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్

కనగల్‌లో..

కనగల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు అన్ని వసతులు ఉన్నాయని జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్‌ను ఉపాధ్యాయులతో కలిసి ఆయన అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకట్రాంరెడ్డి, ఉపాధ్యాయుడు ఉట్కూరి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూర్‌లో..

కట్టంగూర్ : మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థుల హాజరు తక్కువగా ఉండడంతో ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదు. గురువారం కట్టంగూర్ హైస్కూల్‌లో బడిబాట కార్యక్రమంలో భాగంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ చేయనున్నారు.

చండూరులో..

చండూరు: ప్రతిఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బడులకు మాత్రమే పంపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న అన్నారు. చండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆమె విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాలను ఆమె అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తోకల వెంకన్న, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ విజయ, ప్రధానోపాధ్యాయుడు ఎడ్ల భిక్షం, అరుణ, టీఎంసీ సరిత, మమత, వాసంతి, నరసింహారావు, సైదులు, నాగరాజు, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, యాదయ్య, తదితరులు ఉన్నారు.



గట్టుప్పల్ మండల కేంద్రంలో..

గట్టుప్పల్ మండలంలో..

గట్టుప్పల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నాంపల్లి : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేత, జెడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. పాఠశాల పునః ప్రారంభం కావడంతో గురువారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ గురువరావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గాలేంక ఇందిర, ప్రధానోపాధ్యాయులు సంజీవరావు, ఉపాధ్యాయులు దామోదర్‌రావు, నారాయణ, కృష్ణారెడ్డి, పొనగంటి వెంకటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

మర్రిగూడ : విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీపీ గంటికోట రాజమణిహరికృష్ణ అన్నారు. గురువారం పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా మండల కేంద్రంలోని హైస్కూల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ గురువారావు, ప్రధానోపాధ్యాయుడు నీరుడు అంజయ్య, పాఠశాల చైర్మన్ ఫర్జానా, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, సుందరయ్య, శ్రీనయ్య పాల్గొన్నారు.



నాంపల్లి : పుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ



కట్టంగూర్: కల్మెరలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు



చండూరు : విద్యార్థికి పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ



మర్రిగూడ : హైస్కూల్లో పుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ రాజమణి



కేతేపల్లి : పుస్తకాలు అందజేస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

'ఇష్టారాజ్యంగా ఫీజుల వసూళ్లు'

చండూరు : జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే ఫీజులు వసూలు చేస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ యువమోర్చా రాష్ట్ర నాయకుడు పిన్నింటి నరేందర్‌రెడ్డి అన్నారు. చండూరులో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టం వచ్చినట్టు ప్రతి ఏటా ఫీజులు పెంచుకుంటూ పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ఫీజులను నియంత్రించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆస్కాని శ్రీను, పేసర్ల హరీశ్‌కుమార్, బీజేపీ పట్టణ కార్యదర్శి పెద్దగోని శంకర్, పేసర్ల గౌతమ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్ష

మర్రిగూడ : మండలంలోని శివన్నగూడెం రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న నర్సిరెడ్డిగూడెం గ్రామస్తులు నిర్వహిస్తున్న రిలే దీక్ష బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమకు పునరావాసం కల్పించి, పరిహారం అందించే వరకు దీక్ష కొన సాగిస్తామన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, భారతమ్మ, రాములమ్మ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు బెల్టులు అందజేత



కరాటే విద్యార్థులతో సినీ నటుడు సుమన్

నల్లగొండ టూటౌన్: కరాటే నేర్చుకోవాలనే తపనతో నిరంతర సాధన చేసి క్రీడాకారులు బ్లాక్ బెల్టు స్థాయికి ఎదగాలని ప్రముఖ సినీ నటుడు సుమన్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ప్రసాద్ ల్యాబ్‌లో షావోలిన్ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా విద్యార్థులకు నిర్వహించిన కలర్ బెల్టు, గ్రేడింగ్ టెస్టు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. కరాటే నేర్చుకోవడం వల్ల మనోధైర్యంతో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవచ్చన్నారు. అనంతరం కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎల్లో బెల్టు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో షావోలిన్ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా ఫౌండర్ నాంపల్లి కనకారావు, సుమన్ షోటోకాన్ ఫౌండర్ బూడిద సైదులు, తదితరులు పాల్గొన్నారు.

మహేష్‌కు నివాళి

చిట్యాల: మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన ఎద్దం మహేష్(38) మంగళవారం మృతి చెందాడు. మహేష్ మృతదేహాన్ని బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు దైద రవీందర్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు కందిమళ్ళ శిశుపాల్‌రెడ్డి, నాగంపల్లి కిశోర్‌కుమార్, రాచమల్ల జానయ్య, జనార్దన్, దశరథ, శేఖర్, శ్రీనివాస్, నర్సింహ, ప్రవీణ్ పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు



మాట్లాడుతున్న చైర్మన్ సుంకరి మల్లేష్‌గౌడ్

చిట్యాల: వానాకాలం సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చిట్యాల పీఏసీఎస్ చైర్మన్ సుంకరి మల్లేష్‌గౌడ్ అన్నారు. చిట్యాలలో బుధవారం జరిగిన పీఏసీఎస్ పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌లు పీఏసీఎస్ ఆదాయ, వ్యయ నివేదికలను పరిశీలించి ఆమోదించారు. అనంతరం ఎరువులు, విత్తనాల స్టాక్‌ను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ బ్రహ్మాచారి వైస్ చైర్మన్ మెండె సైదులు, సంఘం డైరెక్టర్లు నర్రా మోహన్‌రెడ్డి, కంబాలపల్లి కొమరయ్య, పీఏసీఎస్ సిబ్బంది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



హమాలీలతో మాట్లాడుతున్న వంగూరి రాములు

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న హమాలీలను ఉద్యోగులుగా గుర్తించడంతోపాటు హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎఫ్‌సీఐలో హమాలీలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగంలో ఎగుమతి, దిగుమతులు చేస్తున్న హమాలీలకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సల్లా యాదయ్య, కార్యదర్శి లొడంగి ఉపేందర్, పల్లె నగేష్, కత్తుల యాదయ్య, శంకర్, యాదగిరిరెడ్డి, వంగూరి అశోక్, కృష్ణయ్య పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే పీఏసీఎస్ ధ్యేయం

చౌటుప్పల్ : రైతుల సంక్షేమమే పీఏసీఎస్ ధ్యేయమని సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం నిర్వహించిన సింగిల్‌విండో సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం ప్రస్తుతం రూ. 8కోట్ల టర్నోవర్‌తో నడుస్తుందన్నారు. పంట రుణాన్ని లక్ష నుంచి 2లక్షలకు పెంచాలని, సంఘం గోదాంపై ఆడిటోరియం నిర్మించాలని ఎస్.లింగోటం గ్రామ సొసైటీని పునరుద్ధరించాలని తీర్మానాలు చేశారు. వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య, డైరెక్టర్లు బోరెం నర్సిరెడ్డి, దూర్క కృష్ణ, పబ్బతి వెంకటేశం, దొడ్డి శ్రీశైలం, బొడ్డు పద్మ, సప్పిడి వెంకట్‌రెడ్డి, బాతరాజు సాయిలు, బాలరాజు, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పచ్చి రొట్ట విత్తనాలు సరఫరా చేయాలి

చండూరు: జనుము, జీలుగ, పిల్లి పెసర లాంటి పచ్చి రొట్ట విత్తనాలను సబ్సిడీపై రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సరిపడా సరఫరా చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కాసాల వెంకటరెడ్డి కోరారు. బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కొండారెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన చండూరు మండల వ్యవసాయ అధికారి కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. చండూరు మండలానికి జీలుగు విత్తనాలు నలభై క్వింటాళ్లు, జనములు పది క్వింటాళ్లు మాత్రమే వచ్చాయన్నారు. పచ్చి రొట్ట విత్తనాలను సరిపడా రైతులకు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

అస్తవ్యస్తంగా గ్రామీణ లింక్ రోడ్లు





అధ్వానంగా ఉన్న తిప్పర్తి మండలంలోని దుప్పలపల్లి నుంచి కంకణాలపల్లికి వెళ్లే రోడ్డు

- గుంతలు పడి దెబ్బతిన్న రహదారులు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- రోడ్లను బాగుచేయాలని ప్రజల వేడుకోలు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండల పరిధిలో ప్రధాన లింక్ రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. వివిధ గ్రామాల మధ్య దెబ్బతిన్న రోడ్లతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మామిడాల నుంచి తిప్పర్తి వరకు 8 కిలోమీటర్లు, వెంకటాద్రిపాలెం నుంచి ఇండ్లూరు వరకు 5 కి.మీ., గంగన్నపాలెం నుంచి తిప్పర్తి వరకు 5 కి.మీ. మేర బీటీ రోడ్లు ఉన్నాయి. పంచాయతీరాజ్ పరిధిలో బీటీ రోడ్లు 76 కి.మీ.లు. మట్టి రోడ్లు 32 కి.మీ. ఉన్నాయి. ఈ రోడ్లు దెబ్బతినడంతో ఆయా గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక రోడ్లపై తారు కొట్టుకుపోయి అడుగులోతు గుంతలు ఏర్పడ్డాయి. ఇండ్లూరు నుంచి పజ్జూరు, ఇండ్లూరు నుంచి మామిడాల, నార్కట్‌పల్లి అద్దంకి హైవే నుంచి కాశీవారిగూడెం, దుప్పలపల్లి నుంచి కంకణాలపల్లి మధ్య రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ రోడ్డు మార్గాల గుండా వెళ్లాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దెబ్బతిన్న రోడ్లు ఇవి..

- అనిశెట్టి దుప్పలపల్లి గ్రామానికి అనుకుని ఉన్న హైవే నుంచి కంకణాలపల్లికి 3 కిలోమీటర్ల బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది.
- కాశీవారిగూడెం నుంచి తిప్పర్తి వద్ద నార్కట్‌పల్లి– అద్దంకి రహదారికి చేరుకోవాలంటే 3 కి.మీ. మట్టి రోడ్డుపై ప్రయాణం చేయాల్సి వస్తోంది. గుంతలు పడిన ఈ రోడ్డు గుండా వెళ్తూ అనేకమంది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.
- ఇండ్లూరు నుంచి పజ్జూరుకు 5.7 కిలో మీటర్ల బీటీరోడ్డు ఉంది. రోడ్డంతా గుంతలు పడి ప్రయాణానికి ఇబ్బందిగా మారింది.
- మామిడాల నుంచి నకిరేకల్ రోడ్డు వరకు 5 కిలోమీటర్ల బీటీ రోడ్డు ఉంది. ఇది కూడా గుంతలు పడి ప్రయాణానికి ఇబ్బందిగా ఉంది.





పజ్జూరు రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

తారు తేలి గుంతలు పడ్డాయి



ఇండ్లూరు నుంచి పజ్జూరు వరకు ఉన్న బీటీ రోడ్డు దెబ్బతిని చాలా సంవత్సరాలు అయింది. రోడ్డుపై తారు తేలి గుంతలు పడ్డాయి. గుంతల రోడ్లపై ప్రమాదాల బారిన పడుతున్నాం. ఇటీవల నూతన రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వెంటనే రోడ్డు పనులు చేపట్టాలి.

– ఎండీ. లతీఫ్, పజ్జూరు

ప్రమాదాలకు గురవుతున్నారు



కంకణాలపల్లికి వెళ్లాలంటే నరకయాతన పడుతున్నాం. బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసం అయింది. రోడ్డుపై గుంతలు పడి ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. అత్యవసర సమయంలో ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

– ముత్తినేని సంపత్, కంకణాలపల్లి